క్లుప్తంగా

నేడు రాజేశ్వరస్వామి ఆలయంలో బహిరంగ వేలం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు పాత ఇనుముకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. సీజీఎఫ్ పనుల్లో భాగంగా ఆలయం ముఖ మండపం కొట్టివేయగా వచ్చిన 500 కిలోల పాత ఇనుముకు దేవదాయశాఖాధికారుల సమక్షంలో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

డెప్యూటీ ఈఈగా నవీన్‌కుమార్

పెనమలూరు: విద్యుత్ శాఖ కానూరు సబ్‌డివిజన్ డెప్యూటీ ఈఈగా బి.నవీన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఏడీఈగా పని చేసిన ఎం.పూర్ణచంద్రరావు విజయవాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ నుంచి డెప్యూటీ ఈఈగా నవీన్‌కుమార్ వచ్చారు. కాగా గత కొద్దికాలంగా ఈ పోస్టు పై ఏర్పడిన వివాదం నేపథ్యంలో నవీన్‌కుమార్ నియామకంతో వివాదం ముగిసింది.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి



ఉయ్యూరు: ఆరోగ్యవంతమైన సమాజంతోనే సమాజ ప్రగతి సాధ్యమని లయన్స్ క్లబ్ జిల్లా కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్, కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ట్రెజరర్ ఊర కిషోర్‌కుమార్, ప్రతినిధులు నెల్లి రాంబాబు, అబ్దుల్ హసన్ పాల్గొన్నారు.

యనమలకుదురులో చలివేంద్రం ఏర్పాటు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురు మహాత్మాగాంధీ బొమ్మ సెంటర్‌లో రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి కోసూరి నరేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం, చలువ పందిరిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోసూరి నరేష్ మాట్లాడుతూ యనమలకుదురు ప్రాంతంలో 8 వేల మంది ప్రాథమిక విద్య, అమ్మ ఒడి అందించి చదివిస్తున్న జగనన్న జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించితే పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బాబురావు, కాలనీవాసులు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు సలీం, కరీంబాబు, లంక కోటేశ్వరరావు, అనిల్‌రెడ్డి, బాషా పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఇతోధికంగా సాయం అందిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. తిమ్మనవీడుకు చెందిన వీసం మహేష్ వీబీటీ అమరావతి క్యాంపస్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక స్తోమత లేకపోవటంతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతూ మానవత సంస్థను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో వీసం మహేష్‌కు రూ.17 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం పంపిణీ చేశారు. భవిష్యత్‌లోనూ తన వంతు సాయాన్ని అందిస్తామని మానవత సభ్యులు భరోసా ఇచ్చారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూర్మెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు బాణాల నరసింహరావు, నారగాని కొండలరావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

భూసంప్రోక్షణ కుంకుమ పూజ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ రామాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని రైతులు భూ సంప్రోక్షణ కుంకుమ పూజా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని వ్యవసాయ భూముల్లోని మట్టిని సేకరించి స్వామివారి ఆలయంలో కుంకుమ పూజ చేశారు. నూతన క్రోధి సంవత్సరంలో వ్యవసాయం, పాడి పంటలు విరివిగా పండాలని పూజలు జరిపారు. భూముల్లో రైతులు చల్లుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

పెనమలూరులో ఫ్యాన్ జోష్

- నియోజకవర్గ ప్రజలకు చేరువగా మంత్రి జోగి రమేష్
- ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైనం
- భారీగా వైఎస్సార్ సీపీలోకి వలసలు
- ఖాళీ అవుతున్న ప్రతిపక్షాలు
- కూటమి గుండెల్లో గుబులు



వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపుతున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెట్ స్పీడ్‌తో జోష్‌లో ఉంది. ప్రజాదరణ పెరుగుతుండటంతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి వలస వస్తున్నారు. ఫ్యాన్ స్పీడ్ ధాటికి కూటమి గుండెల్లో గుబులు రేగుతోంది. కొద్ది రోజులుగా సాగుతున్న వలసలతో ప్రతిపక్ష పార్టీలు కార్యకర్తలు లేక ఖాళీ అవుతున్నాయి. మరో వైపు వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మంత్రి జోగి రమేష్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు చేరువ అవుతున్నారు. మంత్రి జోగి రమేష్ తనదైన శైలిలో ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లారు. సంక్షేమ పథకాల పంపిణీ, ఆత్మీయ కలయికలతో పార్టీ శ్రేణులను దగ్గర చేసుకున్నారు. పార్టీ మరింత పటిష్ట స్థితికి చేరుకోవటంతో ప్రతిపక్ష కూటమిలో గుబులు మొదలైంది. ఆదరణ పెరుగుతుండటంతో టీడీపీ, జనసేన పక్షాలకు చెందిన పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ జెండా పడుతున్నారు. నిత్యం ఏదో ఒక గ్రామం నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి వచ్చి చేరుతున్నారు. ప్రధానంగా టీడీపీని నమ్ముకుంటే సరైన న్యాయం జరగదనే భావన కార్యకర్తల్లో నాటుకుపోయింది. చలసాని వెంకటేశ్వరరావు (పండు) కుటుంబానికి జరిగిన అన్యాయమే ఇందుకు నిదర్శనమని పలువురు కార్యకర్తలు మదనపడుతున్న పరిస్థితి. క్షేత్రస్థాయిలో పార్టీ ఖాళీ అవుతుండటంతో ప్రతిపక్ష టీడీపీ, జనసేన పక్షాలు గుబులుపడుతున్నాయి. కూటమిలో బీజేపీ చేరికతో కొన్ని సామాజిక వర్గాలు దూరమయ్యాయి. దీన్ని అధికమించేందుకు ఓ సంస్థ ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ చేతులమీదుగా ఏకంగా కోడ్ ఉల్లంఘించి ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేయటం గమనార్హం.

జోగికి అపూర్వ ఆదరణ....

వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌కు అపూర్వ ప్రజాదరణ లభిస్తోంది. ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నియోజకవర్గం అంతటా విస్తృతంగా చేపడుతున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను సంక్షేమ పాలన వివరించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఆవశ్యకతను తెలియజేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలు హారతులు పట్టి సాదరంగా స్వాగతం పలుకుతున్నారు. తమకు చేకూరిన సంక్షేమాన్ని గుర్తు చేసుకుంటూ జోగికి మద్దతు తెలుపుతున్నారు. జోగితో పాటు ఆయన సతీమణి శకుంతలాదేవి, ఇద్దరు తనయులు జోగి రాజీవ్, జోగి రోహిత్ నిత్యం ప్రజల్లోనే గడుపుతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయానికి, పెనమలూరు గడ్డపై జోగి విజయాన్ని కాంక్షిస్తూ ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు.

కాలనీవాసుల సమస్య పరిష్కారం



వాగుపై పూర్తయిన కల్వర్టు నిర్మాణం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో పామర్తినగర్, రాజీవ్‌నగర్ కాలనీ వాసుల ప్రధాన సమస్యను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పరిష్కరించారు. ఈ రెండు కాలనీల మధ్య ఉన్న వాగుపై కల్వర్టు నిర్మాణం చేసి ప్రజల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. రెండు కాలనీల మధ్య ఉన్న మర్లవాగులో నిరంతరం మురుగునీరు ప్రవహిస్తుంది. ఈ వాగులో నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గతంలో పాలకుల దృష్టికి తీసుకువెళ్లిన ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఇరు కాలనీల వాసుల విజ్ఞప్తి మేరకు స్పందించిన వంశీమోహన్ ఆదేశాలతో గత నెలలో కల్వర్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నిధులు సుమారు రూ. 10 లక్షలతో శరవేగంగా కల్వర్టు నిర్మాణాన్ని పూర్తిచేశారు. భారీ వాహనాల రాకపోకలను తట్టుకునే విధంగా తూములపై కల్వర్టు నిర్మించారు. ఈ వంతెనకు రెండు వైపులా ర్యాంప్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నహాలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపిన వంశీమోహన్‌కు రెండు కాలనీలకు చెందిన ప్రజానీకం కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

కవ్వింపు చర్యలకు దిగిన టీడీపీ



పోరంకిలో వైఎస్సార్ సీపీ శిబిరం వద్ద గొడవకు దిగిన టీడీపీ నేతలు

పెనమలూరు: పోరంకిలో టీడీపీ నేతలు ఆదివారం కవ్వింపు చర్యలకు దిగారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎదురు తిరగటంతో వాహనాల్లో వచ్చిన టీడీపీ, జనసేన నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనతో బందరు రోడ్డు పై కొద్ది సమయం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోరంకిలో ఆదివారం టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ బొర్రా కనకదుర్గ, బొర్రాకృష్ణ, మరో 300 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరటానికి గంగానమ్మ గుడి వద్ద కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంత్రి జోగి రమేష్ హాజరు కావాల్సి ఉంది. కాగా ఉయ్యూరు సభకు వెళుతున్న టీడీపీ, జనసేన నేతల వాహనాలు వైఎస్సార్ సీపీ శిబిరాన్ని చూసి బందరు రోడ్డు పై ఆపి రెచ్చకొట్టే విధంగా అరుపులు కేకలు వేయటం ప్రారంభించారు. దీంతో అక్కడే ఉన్న బొర్రాకృష్ణ వెళ్లి పోవాలని వారిని కోరారు. అయితే టీడీపీ శ్రేణులు మరింత రెచ్చిపోయి బందరు రోడ్డు పై వాహనాలు నిలుపుదల చేసి కవ్వింపు చర్యలకు దిగారు. దీంతో బందరు రోడ్డు పై భారీగా ట్రాఫిక్ ఆగిపోయింది. టీడీపీ నేతల కవ్వింపుకు నిరసనగా వైఎస్సార్ సీపీ శ్రేణులు రంగంలోకి దిగాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో అప్పటివరకు గొడవ చేసిన టీడీపీ నేతలు వాహనాల్లో వెళ్లిపోయారు. టీడీపీ నేతలు కవ్వింపుకు పాల్పడటం పై పోరంకిలో తీవ్ర నిరసన వ్యక్తమయింది.

వంశీని అఖండ మెజార్టీతో గెలిపించాలి



వేంపాడులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరొకసారి సీఎంగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ జిల్లా కార్యదర్శి బొకినాల శామ్యూల్ పిలుపునిచ్చారు. మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి ప్రచారం ఆదివారం నిర్వహించారు. వేంపాడు గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో శామ్యూల్ పాల్గొని ప్రభుత్వం ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధిని వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ నాగనబోయిన శివశంకర్, పీఏసీఎస్ చైర్మన్ సోమేశ్వరరావు, తరిగోప్పల ఎంపీటీసీ తెన్నేటి నటరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

కంకిపాడు: పట్టణంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కొనసాగుతోంది. పలు దుకాణాల వద్ద రాజకీయ పార్టీలకు చెందిన జెండాలను విక్రయిస్తున్నారు. ఇబ్బడిముబ్బడిగా కూటమికి చెందిన జెండాలను బహిరంగ ప్రదేశాల్లో ఉంచి అమ్ముతున్నారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ప్రత్యేక అనుమతులు ఉండాలి. కానీ అవేవీ పట్టనట్లు కొందరు దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఎన్నికల నియమావళి పర్యవేక్షణాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కంకిపాడు ప్రధాన సెంటరులోని ఓ దుకాణం వద్ద ఎగురుతున్న జెండాలు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు



నున్న చెక్ పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ దుర్గాప్రసాద్, సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. కార్లు, వ్యానులు, బైక్‌లను సైతం నిశితంగా పరిశీలిస్తున్నారు. పవర్‌గ్రిడ్ వద్ద, కండ్రిక భవానీబార్ వద్ద, పైపుల రోడ్డు వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. గత వారం చేసిన తనిఖీల్లో రూ.37 లక్షలు నగదు పట్టుకున్నారు. అలానే ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను సైతం సీజ్ చేశామని సీఐ దుర్గా ప్రసాద్ చెప్పారు. చెక్‌పోస్టుల్లో రేయింబవళ్లు వాహనాలు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. నున్న పవర్ గ్రిడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఏలూరు జిల్లా, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతో పాటు విజయవాడ ఆటోనగర్, గుణదల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. పైపులరోడ్డు జంక్షన్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ, నూజివీడు రాకపోకలు సాగించే వాహనాలు సోదా చేస్తున్నామన్నారు.

400 మందికి ఉచిత వైద్య సేవలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆస్టర్ రమేష్ హాస్పటల్స్, పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక కాకాని భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పుట్టగుంట సతీష్‌కుమార్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి.కృష్ణమోహన్ నేతృత్వంలో సుమారు 400 మందికి వైద్య సేవలు అందించారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, రమేష్ హాస్పటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కోనేరు కోటేశ్వరరావు, అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, తాడి రంగారావు పాల్గొన్నారు.

జగనన్నకు ప్రతి ఇంటా విశేష ఆదరణ



వీరవల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఇంట విశేష ఆదరణ లభిస్తుందని బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని కొమటిగుంట ఏరియాలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, గన్నవరం ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీమోహన్‌ను గెలిపించేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు చేయాలని అభ్యర్థించారు. టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల మంజూరు కోసం ప్రజలు జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదని తెలిపారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కుల, మత, రాజకీయ పక్షపాతం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, మనబడి నాడు-నేడు వంటి కార్యక్రమాలు ప్రజల ముందు నేడు కనిపిస్తున్నాయని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా గ్రామగ్రామాన పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం కొత్తగా ఊళ్లు ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గూడవల్లి రత్న సుధాకర్, కోడెబోయిన బాబి, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతో ఆరోగ్య సంరక్షణ



తిరువూరు: ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామంతో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు వల్లభనేని రవీంద్ర అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తిరువూరు నాగార్జున కాలేజీలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రవీంద్ర మాట్లాడుతూ జంక్ ఫుడ్స్ జోలికి పోవద్దని, నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోవద్దని సూచించారు. తాజా కాయగూరలు, పండ్లు ఎక్కువగా తినాలని, నిత్యం ఉదయపు నడక లేదా వ్యాయామంతో మంచి ప్రయోజనాలున్నాయని చెప్పారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, స్థానిక ప్రతినిధులు రాంప్రదీప్, హరికృష్ణ, ఎన్జీవో అసోసియేషన్ తిరువూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎం. ప్రకాశ్‌బాబు, నాగార్జున కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

నగదు, మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఏసీపీ భాస్కరరావు



ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు, గోడౌన్స్ యజమానులతో మాట్లాడుతున్న ఏసీపీ భాస్కరరావు

పటమట(విజయవాడతూర్పు): ఓటర్లకు పంపిణీ చేసేందుకు రాజకీయ పార్టీలు సమకూర్చిన డబ్బు, మద్యం, వస్తువులు రవాణా చేసిన వాహన యజమానులపై, నిల్వ చేసిన గోడౌన్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ భాస్కరరావు హెచ్చరించారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల యజమానులు, గోడౌన్స్ యజమానులతో ఏసీపీ ఆదివారం సమావేశమయ్యారు. పటమట పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ ప్రజలను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ వస్తువులను రవాణా చేసిన వాహనాలను సీజ్ చేస్తామని, ఈ వస్తువులను నిల్వ ఉంచిన గోడౌన్‌లను సీజ్ చేస్తామని తెలిపారు. అయితే డబ్బు, మద్యం, వస్తువులు రవాణా జరుగుతున్నట్లు, గోడౌన్‌లలో నిల్వ ఉంచేందుకు రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రయత్నాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు శాతకర్ణి, వల్లిపద్మ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: బెజవాడ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు డేవిడ్ రాజు ఆధ్వర్యంలో కొమ్మినేని రత్నకుమారి, మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, అయ్యప్పన్, సయ్యద్ ఆలీ, శ్రీనివాసరావు, సాయిబాబు, హనుమంతరావు, పీ బ్రహ్మం సినీ గీతాలు ఆలపించారు. సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. వివిధ రంగాలకు చెందిన ప్రసూనా రామన్, కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ఉమాబలరాం పాల్గొన్నారు.

ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రేపు రాజ్యాంగ శ్రవణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 9వ తేదీ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఎంబీ విజ్ఞాన కేంద్రం బాధ్యుడు పి.మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీ విజ్ఞాన కేంద్రం, జీఆర్కే - పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, పాల్గొని సందేశం అందజేస్తారన్నారు. డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో గాయత్రీ బృందం నృత్యాలు ప్రదర్శిస్తారని తెలిపారు.